సాక్షి నల్లగొండ

శుక్రవారం, 12, మే, 2023



నిస్వార్థ సేవకులు
నర్సులు నిస్వార్థ సేవచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం. - 10లో



ఏసీబీకి చిక్కిన కార్యదర్శి
డిండి పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఎంపీఓ రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 40°/25°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కూలీల సంఖ్య పెంచాలి

మునుగోడు: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఓ కాళిందిని సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె మునుగోడు మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులకు రావాలనుకునే వారు మొదటగా దరఖాస్తులు చేసుకోవాలన్నారను. ప్రస్తుత వేసవిలో వివిధ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను కూలీలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట ఏపీఓ శ్రీనివాస్, టీఏలు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యం



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకుసాగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ.. ఆ పార్టీ నేతలు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులంతా ఉద్యమించాలన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసినప్పుడే ప్రజలు ఆదరిస్తారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీని గద్దె దించేందుకు కమ్యూనిస్టులు ఆయా ప్రాంతీయ పార్టీలకు మద్దతునిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డి.మల్లేశం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, సీహెచ్ లక్ష్మీనారాయణ, కుసిరెడ్డి నాగిరెడ్డి, సయ్యద్‌హాషం పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న దస్రునాయక్

నార్కట్‌పల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) దస్రునాయక్ అన్నారు. నార్కట్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జూనియర్ కళాశాలలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో నూతనంగా జూనియర్ కళాశాల మంజూరైందన్నారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలతో పాటు బాలికల కోసం ఎంపీహెచ్‌డబ్ల్యూతో పాటు ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇస్మాయిల్, అధ్యాపకులు నడింపల్లి వెంకటేశ్వర్లు, ఎస్.వెంకన్న తదితరులు ఉన్నారు.

ఉదయసముద్రమే..





నల్లగొండ సమీపంలోని పానగల్ శివారులో గల ఉదయసముద్రానికి ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో జలకళను సంతరించుకుంది. అలుగు పోస్తుండడంతో యువకులు అక్కడ ఉత్సాహంగా ఈత కొడుతున్నారు. - సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ నల్లగొండ

వైద్యారోగ్య శాఖలో
వసూల్ రాజా!

రిజిస్ట్రేషన్, రెన్యూవల్‌కు సొమ్ము ముట్టజెప్పాల్సిందే

- ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లలో ఇష్టారాజ్య వసూళ్లు
- లేదంటే ఏదో ఒక సాకుతో ఇబ్బందులపాలు చేస్తున్న వైనం
- డీఎంహెచ్‌ఓను కలిసి మొరపెట్టుకున్న వైద్యులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా వైద్యాధికారి కార్యాలయ సిబ్బంది జిల్లాలోని ప్రసూతి ఆస్పత్రులు, పరీక్ష కేంద్రాల నుంచి వసూళ్ల దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఓ అధికారి వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఆస్పత్రుల పరీక్ష కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సమయంలో పెద్ద మొత్తంలో ముడుపులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ఆయన ఆస్పత్రి, స్కానింగ్ సెంటర్ విజిట్‌కు వచ్చారంటే ముడుపులు అందనిదే కదలరని, అడిగినంత ఇవ్వకుంటే కొర్రీలు పెడుతూ వేధిస్తుంటారని ఆస్పత్రుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. సదరు అధికారి తీరుతో విసిగిపోయిన జిల్లా గైనకాలజిస్టులు అంతా ఇటీవల డీఎంహెచ్‌ఓ కొండల్‌రావును కలిసి సదరు అధికారిపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఆస్పత్రులను సందర్శించాల్సిందే..

జిల్లాలో 476 ప్రైవేట్ ఆస్పత్రులు, దాదాపు 50 వరకు స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ ప్రాంతాల్లోనే అత్యధికంగా ఉన్నాయి. వాటిల్లో కొన్ని ఆస్పత్రుల్లో అనుమతి లేకపోయినా లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిని అరికట్టాల్సిన సదరు అధికారి.. అన్ని ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ కేంద్రాలపై పడి అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారంలో రెండు మూడు ఆస్పత్రులు గానీ స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లను గానీ తనిఖీ చేయడం.. ముడుపులు డిమాండ్ చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నట్లు ప్రైవేట్ వైద్యులు ఆరోపిస్తున్నారు.

రెన్యూవల్ కావాలంటే ముట్టజెప్పాల్సిందే..

ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్ల రెన్యూవల్ కావాలంటే పెద్ద ఎత్తున అప్పజెప్పాల్సిందే. మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) రెన్యూవల్‌కు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రీకాన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నోస్టిక్ టెస్టు కొత్త రిజిస్ట్రేషన్‌కు రూ.లక్షన్నర ఇవ్వాలని పట్టుపడుతున్నారని, లేదంటే ఇబ్బందులపాలు చేస్తున్నట్లు వైద్యులు వాపోతున్నారు. కొత్త ఆసుపత్రి రిజిస్ట్రేషన్ చేసుకుంటే రూ.50 వేలు, ల్యాబ్‌కు రూ.25 వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇక ఆరోగ్యశ్రీ ఉన్నవి, కాస్త పెద్ద ఆస్పత్రి అయితే బిజినెస్‌ను బట్టి రేటు నిర్ణయిస్తున్నారట.

డీఎంహెచ్‌ఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు

సదరు అధికారి తీరుపట్ల పలు ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులంతా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అనిమల్ల కొండల్‌రావుకు ఇటీవల ఫిర్యాదు చేశారు. తమనుంచి ముడుపులు ఎలా వసూలు చేసున్నారనే విషయాన్ని అందులో వివరించారు. మరోవైపు జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి కూడా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీలను వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా జడ్జి, ఎస్పీ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు పంపినట్లు పేర్కొన్నారు. దీనిపై డీఎంహెచ్‌ఓను వివరణ కోరగా.. వైద్యులు ఎంటీపీ రిజిస్ట్రేషన్, రెన్యూవల్‌కు సంబంధించిన మార్గదర్శకాల కోసం తనను కలిశారని పేర్కొన్నారు.



డీఎంహెచ్‌ఓ కొండల్‌రావును కలిసిన గైనకాలజిస్టులు

ప్రజారక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలి

- ఎస్పీ అపూర్వరావు



కేతేపల్లి: మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నకిరేకల్, కేతేపల్లి, నల్లగొండ క్రైం: ప్రజా రక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. గురువారం నకిరేకల్, కేతేపల్లి, తిప్పర్తి పోలీస్ స్టేషన్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్లలో సిబ్బందికి పలు సూచనలు చేసిన అనంతరం మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ పోలీసులు గౌరవిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. హైవేపై నిత్యం తనిఖీలు నిర్వహించాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సామాన్యులు పోలీస్ స్టేషన్‌కు వస్తే న్యాయం జరుగుతుందనే నమ్మకం భరోసాను కల్పించాలన్నారు. సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్, ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఆమె వెంట నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, శాలిగౌరారం సీఐ రాఘవరావు, తిప్పర్తి ఎస్ఐ ప్రవీణ్, కేతేపల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవాలి



చిట్యాలలో రైస్‌మిల్లర్స్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

చిట్యాల, మునుగోడు: మిల్లర్లు.. ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. చిట్యాల లోని వ్యవసాయ మార్కెట్‌లో, ఉరుమడ్ల, మునుగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు చిట్యాల, వట్టిమర్తి, మునుగోడు గ్రామాల పరిధిలోని రైస్ మిల్లులు, వాటి గోదాములను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రైస్‌మిల్లుల గోదాములను పరిశీలించి రైస్‌మిల్లర్స్‌తో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఇతరుల గోదాములను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ ఆర్ఐ లింగస్వామి, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు, మునుగోడు తహసీల్దారు కృష్ణారెడ్డి, డీటీసీఎస్ విజయ, వేలుపల్లి వెంకటేశ్వర్లు ఉన్నారు.

గురుకుల టీచర్ పరీక్షకు ఉచిత శిక్షణ

చౌటుప్పల్ : గురుకుల టీచర్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ బీసీ ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం ఉమ్మడి జిల్లా సంచాలకులు కొప్పు విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. నేటి నుంచి ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డిగ్రీ, బీఈడీ మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు 75శాతం హాజరు ఉంటే స్కాలర్‌షిప్, ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తామన్నారు. గతంలో శిక్షణ పొందిన అభ్యర్థులు అనుమతి లేదన్నారు. జూన్ 1నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, మరిన్ని వివరాలకు 08682 – 220007 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మెప్మా పీడీ.. ప్రభుత్వానికి సరెండర్

- అనుమతి లేకుండా 15 రోజుల క్రితం సెలవుపై వెళ్లిన పీడీ
- రెండుసార్లు షోకాజ్ నోటీసులిచ్చినా సమాధానం ఇవ్వని అధికారి
- సీరియస్‌గా పరిగణించి ప్రభుత్వానికి లేఖ రాసిన అదనపు కలెక్టర్

నల్లగొండ టూటౌన్: మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) శ్రీపాద రామేశ్వర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. మెప్మా పీడీ విధుల పట్ల నిర్లక్ష్యంపై అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా రెండుసార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా సమాధానం ఇవ్వకుండా 15 రోజుల క్రితం సెలవుపై వెళ్లారు. స్థానిక సంస్థల కలెక్టర్ నుంచి అనుమతి పొందకుండానే సెలవుపై వెళ్లడా



న్ని తీవ్రంగా పరిగణించారు. కింది స్థాయి ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉద్యోగులకు సంబంధించి చిన్న, చిన్న విషయాలను పీడీ దృష్టికి తీసుకుపోయినా వారిపైనే అసహనం వ్యక్తం చేసి వారిపై నోరు పారేసుకున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. మెప్మా పీడీ వ్యవహారశైలి తీరు బాగాలేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గతనెలలో అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఇటు విధుల పట్ల అలసత్వం, ఉద్యోగులపై కక్షసాధింపు లాంటి వాటిపై సీరియస్‌గా తీసుకున్న అదనపు కలెక్టర్.. ఆయనను గురువారం ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ లేఖ రాశారు.

ఆది నుంచి వివాదాస్పదుడే..

మెప్మా పీడీ.. ముక్కుసూటిగా వ్యవహరించడంతో పాటు అంకితభావంతో పని చేస్తారని మొదట్లో ప్రచారం జరిగింది. మెప్మా పీడీగా విధుల్లో చేరిన కొన్నాళ్లకే ఆయన వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా పని చేస్తూనే కొన్నాళ్లు ఇక్కడ ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇక్కడికి సరిగా రాకపోవడం, ఫైళ్లన్నీ రంగారెడ్డి జిల్లా మెప్మా కార్యాలయానికి తెప్పించుకోవడం, రోజంతా అక్కడ పడిగాపులు కాయడం, ఉద్యోగుల జీతాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు పెట్టకుండా కొర్రీలు పెట్టినట్లు సంబంధిత ఉద్యోగులు అప్పట్లోనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. ఆ తరువాత రెగ్యులర్ పీడీగా ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. అయినా ఆయన తీరులో మార్పు రాకపోవడం, ఉద్యోగుల పట్ల అమర్యాదగా మాట్లాడడం లాంటి కారణాలతో ఇరువురి మధ్య గ్యాప్ పెరుగుతూ వచ్చింది. ఒక ఉద్యోగి జీతం ఏడాదిన్నర పాటు ఆపడం, మెప్మా ఉద్యోగులు, పీడీ మధ్య వార్ అని 'సాక్షి' లో ప్రచురితం కావడంతో అప్పటి కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు సంబంధిత పీడీపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 'సాక్షి' లో వచ్చిన కథనానికి పెండింగ్ వేతనం వెంటనే మంజూరు చేశారు. ఆ తరువాత కూడా మెప్మా జిల్లా కార్యాలయ ఉద్యోగులు, పలు మున్సిపాలిటీల్లోని మెప్మా ఉద్యోగులు, పీడీకి మధ్య ఘర్షణ పూర్తి వాతవారణమే ఉంది. ఇటీవల మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వచ్చినప్పుడు కూడా మెప్మా పీడీ విధులకు హాజరుకాకపోవడం వల్లే పీడీని అదనపు కలెక్టర్.. ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ఆయిల్‌పామ్ లక్ష్యాన్ని చేరుకోవాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ఇనుపాములలో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

కేతేపల్లి: జిల్లాకు నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇనుపాముల గ్రామంలో ఆయిల్‌పామ్ నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి జిల్లాకు కేటాయించిన 14,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులకు సరిపడా మొక్కలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కల వివరాలను పతంజలి కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సరైన సమయంలో డ్రిప్ పరికరాలు అందించాలని ఉద్యాన శాఖ, పతంజలి కంపెనీ అధికారులకు సూచించారు. జిల్లాలో మూడు నర్సరీల ద్వారా 8.20 లక్షల మొక్కలను రైతులకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఉద్యాన వన పట్టుపరిశ్రమ శాఖ అధికారి జి సంగీత లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, ఉద్యాన అధికారులు రావుల విద్యాసాగర్, రిషిత, పతంజలి పామాయిల్ కంపెనీ డీజీఎం యాదగిరి, మేనేజర్ నర్రా రవీందర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు నరేందర్, అనిల్, ఏఓ పురుషోత్తం ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నకిరేకల్: జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన నకిరేకల్ మండలం తాటికల్‌లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గోనె సంచులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ధాన్యం ఎగుమతుల విషయంలో కూడా లారీలను అందుబాటులో పెట్టుకోవాలని చెప్పారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకలోనూ జేపీఎస్‌ల నిరసన



పెళ్లి మండపంలో ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేస్తున్న వరుడు, జూనియర్ కార్యదర్శులు

చౌటుప్పల్ : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఓ జూనియర్ పంచాయతీ కార్యదర్శి తన వివాహ వేడుకలోనూ నిరసన కొనసాగించాడు. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన చింతల శ్రీకాంత్.. ఇదే మండలంలోని పంతంగి గ్రామ కార్యదర్శిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు గురువారం కట్టంగూరు మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన చందనతో వివాహం జరిగింది. వివాహానికి చౌటుప్పల్ మండలంలోని రెగ్యులర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు పరిసర మండలాల్లో పనిచేసే సహచర జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. మూడుముళ్ల తంతు పూర్తికాగానే బంధుమిత్రులు, అతిథులు నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు వేదికపైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వరుడు శ్రీకాంత్ తన భార్యతో కలిసి ప్లకార్డుతో వినూత్నంగా నిరసనకు దిగాడు. జేపీఎస్, ఓపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్లకార్డును ప్రదర్శించారు. అక్కడే ఉన్న మిగతా కార్యదర్శులు కూడా వేదికపైకి వెళ్లి నిరసనలో పాల్గొన్నారు. ఇప్పటికైనా పెద్ద మనసు చేసుకొని కార్యదర్శుల సమస్యను పరిష్కరించాలని అతిథులు కూడా సీఎం కేసీఆర్‌ను వేడుకున్నారు.

విధుల నుంచి మళ్లీ సమ్మెలోకి..

- ప్రభుత్వం హెచ్చరించినా పట్టువిడవని జేపీఎస్, ఓపీఎస్‌లు
- విధుల్లో చేరిన మరుసటి రోజే 59మంది సమ్మెబాట
- రెగ్యులరైజ్ చేయాలని డివిజన్ కేంద్రాల్లో దీక్షలు
- పంచాయతీ కార్యదర్శులకు మద్దతు పలుకుతున్న ప్రతిపక్షాలు



నల్లగొండలో సమ్మె చేస్తున్న కార్యదర్శులు (ఫైల్)

నల్లగొండ: సమ్మెబాట పట్టిన జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరకపోతే తొలగిస్తామంటూ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తోంది. అయినప్పటికీ కార్యదర్శులు పట్టువిడవకుండా తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గతకొన్ని రోజులుగా డివిజన్ కేంద్రాల్లో దీక్షలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం చేసే హెచ్చరికలకు భయపడి కొందరు కొందరు విధుల్లో చేరుతున్నపట్టికీ సంఘ నాయకుల సలహాలతో మరుసటిరోజే తిరిగి సమ్మెలోకి వస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి.

730 మంది జేపీఎస్, ఓపీఎస్‌లు..

జిల్లాలో 844 గ్రామ పంచాయతీల పరిధిలో 110 మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. 2019లో రాత పరీక్ష ద్వారా 648 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరారు. ఆ తర్వాత వివిధ కారణాలతో, ఇతర ఉద్యోగాలు రావడంతో కొందరు రాజీనామా చేసి వెళ్లడంతో ఆయా ఖాళీల్లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కొందరు కార్యదర్శులను నియమించారు. ప్రస్తుతం జిల్లాలో 648 జేపీఎస్‌లు, 82 మంది ఓపీఎస్‌లతో (రెగ్యులర్ వాళ్లు మినహా)కలుపుకొని మొత్తం 730 మంది ఉన్నారు.

సమ్మె నుంచి విధుల్లోకి..

మంగళవారం సాయంత్రంలోగా విధుల్లో చేరకపోతే సర్వీస్ నుంచి తొలగిస్తామంటూ ప్రభుత్వం హెచ్చరించడంతో జిల్లా వ్యాప్తంగా 110 మంది జేపీఎస్‌లు, 25 మంది ఓపీఎస్‌లు విధుల్లో చేరారు. అయితే మరుసటి రోజు నుంచి సమ్మె విరమిస్తారన్న చర్చ కూడా జరిగింది. కానీ, సంఘం నాయకుల సూచనలతో వీధుల్లో చేరిన వారిలో జేపీఎస్ 53మంది, ఓపీఎస్‌లు ఆరుగురు మరుసటి రోజే తిరిగి సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో సమ్మె యథాదావిధిగా కొనసాగుతుండగా వీరికి ప్రతిపక్ష నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితోపాటు ఇతర పార్టీ నాయకులు కూడా కార్యదర్శులకు మద్దతు తెలిపారు. వారు కూడా జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



"ప్రభుత్వం అన్నమాట ప్రకారం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి. మూడేళ్ల పాటు శిక్షణ కాలం తర్వాత కూడా మరో ఏడాది పొడిగించారు. గతనెల ఏప్రిల్ 12తో నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయింది. వెంటనే రెగ్యులరైజ్ చేయకుంటే సమ్మెను కొనసాగిస్తూనే ఉంటాం.

– గుండగోని సతీష్, జేపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

"నిబంధనల ప్రకారమే జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామక ప్రక్రియ చేపట్టారు. పంచాయతీల్లో చేపట్టే ప్రతిపనినీ తూచ తప్పకుండా అమలు చేయడం వల్లే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేసి జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి.

– రవీందర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి

క్లుప్తంగా

ధాన్యం లోడ్ ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్

మాడుగులపల్లి: మండల కేంద్రం శివారులో గురువారం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. చెరువుపల్లి గ్రామానికి చెందిన జూపూడి ఆంజనేయులు స్థానిక కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను లోడ్ చేసుకొని మిర్యాలగూడలోని రైస్‌మిల్లులో దిగుమతి చేసేందుకు బయలుదేరాడు. మాడుగులపల్లి శివారుకు రాగానే ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపి మూత్రవిసర్జనకు వెళ్లాడు. గేరు న్యూట్రల్‌లో ఉండడంతో ట్రాక్టర్ రోడ్డు దిగువకు వెళ్లి బోల్తాపడింది. దీంతో బస్తాలు కింద పడి ధాన్యం నేలపాలైంది. కాగా.. లారీల కొరత కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నామని, అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్లు, నల్లాలు ధ్వంసం



గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఫ్యాన్లు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డలో గల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు– మన బడి పథకంలో భాగంగా 3వ తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు, లైట్లు, నల్లాలు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం పాఠశాల హెచ్‌ఎం కాంతయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ సైదులు మాట్లాడుతూ రాత్రి సమయంలో కొంతమంది ఆకతాయిలు పాఠశాలలోనికి ప్రవేశించి వీటిని ధ్వంసం చేశారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.



ధ్వంసమైన నల్లాలు

నర్సులు.. నిస్వార్థ సేవకులు

- ఆస్పత్రుల్లోని రోగులకు నిరంతరం వైద్యసేవలు
- మానవతామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో ఈ వృత్తిలోకి..

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సులు

నల్లగొండ టౌన్: ఆస్పత్రుల్లోని రోగులకు నిరంతరం వైద్య సేవలందించడమే నర్సుల లక్ష్యం. ఆప్యాయంగా పలకరిస్తూ రోగులకు సమయానికి మందులు వేసి వారు కోలుకోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. నర్సు వృత్తికి మానవసేవే మాధవసేవ అనే పరమార్థం కూడా ఉంది. వృత్తికి రూపకల్పన చేసిన మానవతామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్. ఈమె 1820 మే 12న ఇంగ్లాండ్‌లో జన్మించారు. తండ్రి కోరికకు విరుద్ధంగా నర్సింగ్ వృత్తిని ఎంచుకుని మిలటరీ వైద్యశాలలో నర్సుగా పనిచేశారు. క్రిమియన్ యుద్ధంలో క్షతగాత్రులైన సైనికులకు సేవలందించి వారి ప్రాణాలను కాపాడారు. రాత్రి వేళల్లో లాంతరు పట్టుకుని వెళ్లి క్షతగాత్రులకు సేవచేశారు. అందుకే ఈమె 'ఏ లేడీ విత్ ల్యాంప్'గా పేరు పొందారు. ఆమె జన్మదినం సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నాం.

నల్లగొండ జిల్లాలో 1000 మందికిపైగా నర్సులు..

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను కలుపుకుని సుమారు వెయ్యి మందికి పైగా నర్సులు నల్లగొండ జిల్లాలో సేవలు అందిస్తున్నారు. అయితే ఎంతోమంది ప్రాణాలు కాపాడి వారి జీవితాల్లో ఆనందాలు నింపిన నర్సుల కళ్లలో మాత్రం వెలుగులు నిండడం లేదు. ప్రభుత్వం నుంచి తమకు ఆదరణ కరువైందని, పనిచేసే దగ్గర కనీస వసతులుకాని, సరైన వేతనం, గౌరవం లేకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. దీంతోపాటు పై అధికారుల వేధింపులు, రోగుల బంధువుల నుంచి ఈసడింపులకు గురవుతున్నామని వాపోతున్నారు. తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. కాంట్రాక్టు పద్ధతిన తీసుకున్న తమ సర్వీసును క్రమబద్ధీకరించకుండా తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల స్థాయికి తగ్గట్లుగా నర్సులను నియమించకుండా ఉన్న అరకొర సిబ్బందితోనే పనిచేయిస్తూ తమపై పనిభారాన్ని మోపుతున్నారని పేర్కొంటున్నారు. ఇన్ సర్వీస్‌లో బీఎస్సీ నర్సింగ్ చదువుకోవడానికి వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, నర్సింగ్ సిబ్బందికి రెస్ట్, డ్రెస్సింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సేవచేసే భాగ్యం నర్సులకే దక్కుతుంది



రోగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే. ఆ అవకాశం కేవలం నర్సులకే దక్కుతుంది. రోగులకు సేవ చేయడంలో ఉన్న ఆనందం దేంట్లోనూ ఉండదు. నర్సింగ్ వృత్తిలో మంచి సంతృప్తిని పొందుతున్నా.

– ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్– 2

అదృష్టంగా భావిస్తున్నా..



నర్సింగ్ వృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ వృత్తిలో లభించే సంతృప్తి మరే వృత్తిలో దొరకదు. నర్సుగా పనిచేస్తూ ఎంతో మందికి ప్రాణాలు కాపాడవచ్చు. రోగులకు సేవలందించడం కోసమే ఈ వృత్తిని ఎంచుకున్నా.

– ఎన్. నీలాబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్–2

● కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



జేపీఎస్, ఓపీఎస్‌ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఏసీబీకి చిక్కిన గ్రామ కార్యదర్శి

- ఇంటి రికార్డు పేపర్లు ఇచ్చేందుకు రూ.10వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి చిక్కిన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ (మధ్యన కూర్చున్న వ్యక్తి)

డిండి: గ్రామ పంచాయతీ రికార్డులో ఉన్న ఇంటి ధ్రువపత్రం ఇవ్వడం కోసం రూ.10వేలు లంచం తీసుకుంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇంచార్జీ ఎంపీవో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ .శ్రీకృష్ణగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన బైరోజి శంకరయ్య తండ్రి తిరుపతయ్య పేరు మీద డిండి గ్రామకంఠంలో 1975–80 సంవత్సర రికార్డు ప్రకారం 1100 గజాల స్థలంలో కొంత మేర ఇల్లు ఉంది. ఆ స్థలంలో 500 గజాల వరకు ఇతరులు ఆక్రమించుకుకోవడంతో తిరుపతయ్య మరణానంతరం కుమారులైన నారాయణ, శంకరయ్యకు కలిపి 600 గజాల స్థలం మాత్రమే మిగిలి ఉంది. ఆక్రమణదారుల నుంచి తమ స్థలం ఇప్పించాలని శంకరయ్య పలుమార్లు గ్రామ పెద్దలు, స్థానిక పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లాడు. తమ ఇంటి నెంబర్ ఆధారంగా 1975–80 సంవత్సరానికి సంబంధించిన రికార్డు ప్రకారం పేపర్లు ఇవ్వడంతోపాటు తమ పేరు మీదకు ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో డిండి గ్రామ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌ను శంకరయ్య సంప్రదించాడు. ఇందుకోసం గ్రామకార్యదర్శి రూ.10వేలు డిమాండ్ చేశాడు. ఫిబ్రవరి 24న రూ.5 వేలు చెల్లించినా పేపర్లు మాత్రం ఇవ్వక పోగా మరో రూ.10వేలు ఇవ్వాలని గ్రామకార్యదర్శి డిమాండ్ చేశాడు. దీంతో శంకరయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం మధ్యాహ్నం డిండిలోని ఎంపీడీవో కార్యాలయంలో బైరోజీ శంకరయ్య గ్రామకార్యదర్శి శ్రావణ్‌కుమార్‌కు రూ.10 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో శ్రావణ్‌కుమార్‌ను శుక్రవారం హాజరుపరుచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా దేవరకొండలో గ్రామకార్యదర్శి నివాసం ఉంటున్న ఇంట్లో కూడా ఏసీబీ అధికారులు దాడులు జరిపి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డీఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్లు వెంకట్రావ్, రామారావు, లింగస్వామి, సయ్యద్ ఖాదర్‌జిలానీ ఉన్నారు.

ఈ రోడ్డు ఏ ఊరికి వెళ్తుందని అడిగి..

- మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన దుండగులు



చింతపల్లి: తక్కెళ్లపల్లి గ్రామంలో బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ విఠల్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళను ఈ రోడ్డు ఏ ఊరికి పోతుందని సమాచారం అడిగి ఆమె మెడలోని పుస్తెల తాడును అపహరించుకు వెళ్లారు. ఈ సంఘటన గురువారం ఆత్మకూరు మండలంలోని కప్రాయపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవరపల్లి అండాలు సిరికంచల బాయి నుంచి పెద్దబావికి తన భర్త శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నడుచుకుంటూ వెళ్తుంది. భర్త శ్రీనివాస్‌రెడ్డి కొద్దిదూరంలో ఉన్నాడు. ఈక్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చారు. అందులో ఒకరు బైక్‌పై ఉండగా మరొకరు అండాలు వద్దకు వచ్చి ఈ రోడ్డు ఎటువైపు వెళ్తుందని అడిగాడు. అందుకు ఆమె సమాధానం చెప్పేలోగా ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ దొమ్మేటి నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి..

చింతపల్లి: నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు తులం బంగారు పుస్తెల తాడు (బంగారం గుండ్లు) అపహరించుకెళ్లారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున చింతపల్లి మండల పరిధిలోని తక్కెళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసోజు శాంభమ్మ తన ఇంటి సమీపంలోని రాసోజు చంద్రయ్య ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న తులం బంగారు గుండ్లను అపహరించుకెళ్లారు. స్థానిక సర్పంచ్ ఎస్ఐకు సమాచారం అందించడంతో నాంపల్లి సీఐ విఠల్‌రెడ్డితో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుర్రంపోడు: మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన వెలుగు సూర్యనారాయణ(50) గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు తెగి ఉన్న విద్యుత్‌వైర్లు కాలికి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు వెలుగు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా.. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కొండమల్లేపల్లి: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన జై, రాహుల్‌లు తమ పని ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై పయనమయ్యారు. కాగా.. కొండమల్లేపల్లిలోని సాగర్ రోడ్డులో ఫర్నిచర్ తయారు చేసే షాపులో పనిచేస్తున్న బెంగాల్‌కు చెందిన రంజిత్ పని ముగించుకొని బైక్‌పై కొండమల్లేపల్లిలోని తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో సాగర్ రోడ్డులోని సాయి చౌదరి హోటల్ సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీరబాబు తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు..

భువనగిరి: కారు చెట్టును ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన భువనగిరి మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోయినిపల్లికి చెందిన ముగ్గురు యువకులు గురువారం యాదగిరిగుట్టలో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి మండలంలోని మాసుకుంట సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నిఖిల్, శ్రీనివాస్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు వీటిని చికిత్స కోసం పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. రెండు కార్లు ధ్వంసం



ధ్వంసం అయిన కారు

బీబీనగర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న కారును ఢీకొనగా.. ఆ కారు దాని ముందు ఉన్న మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. హన్మకొండ డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్తుంది. ఈక్రమంలో బైపాస్‌లోని ఎస్‌బీఐ ఎదుట రహదారిపై ముందు వెళ్తున్న రెండు కార్లలో ఓ కారు ఒక్కసారిగా స్పీడ్‌ను తగ్గిస్తూ వెళ్తుండగా.. కారు వెనుకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు వేగం నియంత్రణలోకి రాకపోవడంతో ముందు ఉన్న కారును ఢీకొట్టింది. దీంతో ఆ కారు దాని ముందు ఉన్న మరో కారును ఢీకొట్టింది. కార్లలో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు



కనగల్ : కారు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. రామన్నపేట మండల పరిధిలోని జనంపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు పూజారి సొప్పరి చంద్రయ్య బృందం నాంపల్లి మండలంలో ఎల్లమ్మ పండుగ చేసి తిరిగి నల్లగొండకు వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కారు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో కారు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఐదుగురిలో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా మిగతావారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం జేసీబీ సహాయంతో కారును బయటకు తీశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



పర్వతం మహేష్

భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి పట్టణ శివారులోని ఫ్లైవుడ్ కంపెనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ విక్రమ్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన పర్వతం మహేష్ (30) ఇనుప సామగ్రి బేరం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తన బైక్‌పై వ్యక్తిగత పనిమీద పోచంపల్లి వైపు వస్తున్న క్రమంలో పట్టణ శివారులోని ఫ్లై వుడ్ కంపెనీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా.. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



వలిగొండ: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వలిగొండ మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గస్తీ తిరుగుతున్న పోలీసులకు రోడ్డుపై మృతదేహం కనిపించగా పోలీస్‌స్టేషన్ కు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై శ్యామ్ సుందర్ రెడ్డి అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు హనుమాన్ మాల ధరించాడని, కాషాయం రంగు దుస్తుల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


కేన్సర్‌తో బీజేపీ నేత కుమార్తె మృతి

వేములపల్లి: కేన్సర్ బారిన పడి కొంతకాలంగా చికిత్స పొందుతున్న బాలిక గురువారం తుదిశ్వాస విడిచింది. బీజేపీ మండల అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి కుమార్తె తపశ్రీ(8)కి ఏడాది క్రితమే ఎముకల కేన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరు నెలల కిందట రూ.12లక్షలకు పైగా వెచ్చించి ఆపరేషన్ సైతం చేయించారు. వారం రోజుల కిందట బాలిక మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించినా ఫలితం కనిపించలేదు. కీమోథెరపీకి శరీరం స్పందించక ప్రాణాలు కోల్పోయింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, మిర్యాలగూడ నియోజకవర్గ బాధ్యురాలు కవిత బాలిక మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మామిడి సాగులో కొమ్మ కత్తిరింపులు కీలకం

- యాజమాన్య పద్ధతులపై ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి మురళి సూచనలు





గుర్రంపోడు: మామిడి మొక్కలు నాటినప్పటి నుంచి కొమ్మలు జాగ్రత్తగా కత్తిరింపు చేస్తే చెట్టుకు మంచి ఆకృతి రావడంతోపాటు, గాలి, సూర్యరశ్మి బాగా ప్రసరించి నాణ్యమైన, అధిక దిగుబడులకు దోహదపడుతుందని ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి మురళి తెలిపారు. మామిడి చెట్లకు కత్తిరింపులు, యాజమాన్య పద్ధతులపై సూచనలు ఆయన మాటల్లోనే..

చిన్న మొక్కల నుంచే కత్తిరింపు..

మామిడి మొక్క మూడు, నాలుగు అడుగులు పెరగనిచ్చి ఆ తర్వాత బలమైన పక్క కొమ్మలు ఏపుగా పెరిగేలా చూడాలి. అంతవరకు కాండంపై కొమ్మలను రాకుండా తీసివేయాలి. ఆపై మూడు ప్రథమ కొమ్మలు ఒకే చోట పుట్టకుండా ఒక్కో కొమ్మ 9 అంగుళాల దూరం వచ్చేలా చూడాలి. మొదట వచ్చిన ప్రధాన కొమ్మలను ప్రథమ కొమ్మలనుకుంటే, ఒక్కో ప్రథమ కొమ్మకు 3 ద్వితీయ కొమ్మలు, ఒక్కో ద్వితీయ కొమ్మకు మూడు తృతీయ కొమ్మలు, ఒక్కో తృతీయ కొమ్మకు మూడు చతుర్థ కొమ్మలు, ఇలా ప్రతి చెట్టులో 243 కొమ్మలు ఏర్పడతాయి. ఈ కొమ్మలన్నీ క్రమపద్ధతిలో పెరగడం వల్ల నలుదిశలా వ్యాపిస్తాయి. ఈ కొమ్మలన్నీ ఒకదానిపై మరొకటి రానందున, చిక్కు కొమ్మలు ఏర్పడనందున మంచి దిగుబడులు వస్తాయి. చిన్న మొక్కకు సకాలంలో సరైన కత్తిరింపులతో చెట్టు పెద్దయ్యాక మంచి ఆకారంతోపాటు, నాణ్యమైన సుస్థిర దిగుబడులు వస్తాయి.

గాలి, సూర్యరశ్మి రావడానికి..

గాలి, సూర్యరశ్మి ద్వారా చెట్టుకు కావాల్సిన ఆహార పదార్థాలు తయారై శ్వాస ద్వారా శక్తిగా మారి ఎదుగుదలకు, పుష్పించేందుకు, కాయలు వృద్ధి చెందేందుకు తోడ్పడతాయి. ఆకులు గుబురుగా ఉంటే సూర్యరశ్మి, గాలి తీసుకోక ఆహారపదార్థాల ఉత్పత్తి చెట్టులో తగ్గిపోయి దిగుబడి తగ్గిపోతుంది. చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యల పరిష్కారానికి మామిడిలో కత్తిరింపులు తప్పనిసరిగా చేసుకోవాలి.

కొమ్మల కత్తిరింపు విధానం

- కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్టుకు విశ్రాంతినివ్వాలి. అప్పుడే కొంత బలాన్ని పుంజుకుంటాయి. విశ్రాంతి నిచ్చిన తరువాత కొమ్మల కత్తిరింపులు ప్రారంభించి ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలి.
- అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, తెగులు సోకి ఎండిన కొమ్మలను పూర్తిగా కత్తిరించి తొలగించాలి.
- వ్యవసాయ పనులకు అడ్డంగా లేకుండా నేలను తాకుతున్న కొమ్మలను మొదటికి కత్తిరించి తొలగించాలి.
- ఎండిన పూత, కాడల ద్వారా ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉన్నందున వాటిని తొలగించాలి.
- గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలకు ప్రసరించేలా తలపై మూడు, నాలుగు అంగుళాల మందం ఉన్న కొమ్మలను కత్తిరించి ఖాళీ స్థలం చేయాలి. దీనివల్ల మధ్యాహ్న సమయంలో ఎండ మొదలుపై పడుతుంది.
- అవసరమైన తూర్పు, పడమర దిశల్లోనూ 2 నుంచి 3 అంగుళాల మందమున్న కొమ్మలను కత్తిరించి కొమ్మల మధ్యలో ఖాళీ స్థలం ఏర్పడేలా చేయడం వల్ల సూర్యరశ్మి ఖాళీ స్థలం గుండా లోపలకు ప్రసరిస్తుంది. కొమ్మలు ఎక్కువగా వచ్చే బంగనపల్లి రకంలో ఈ రకం కత్తిరింపులు తప్పనిసరి చేసుకోవాలి.
- చెట్ల కొమ్మలు కత్తిరించడం వల్ల కొత్తగా పుట్టుకొచ్చే లేత కొమ్మలు 4 నుంచి 5 నెలలకే ముదిరి పూతకు వస్తాయి. కత్తిరించిన కొమ్మల నుంచి వచ్చిన లేత కొమ్మలు డిసెంబర్‌లో మంచి పూత పూస్తాయి.
- కత్తిరింపులు పూర్తయిన వెంటనే మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి చెట్టు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

యాజమాన్య పద్ధతులు

- రాలిపోయిన కాయలు, పండ్లు, ఎండు పుల్లలను, చెట్ల మొదళ్లలో ఎండిన బెరడును తీసి శుభ్రం చేసుకొని దున్నుకోవాలి. మొదటి దఫా ఎరువులు వేసుకోవాలి.
- నీటి వసతి ఉన్న చిన్న తోటల్లో అంతరపంటలు వేసుకోవచ్చు.
- లేత ఆకులు వచ్చిన మొక్కలకు సూక్ష్మధాతు మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.

కల్తీ పాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కల్తీ పాల ప్యాకెట్లు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని భీమనపల్లి గ్రామంలో కల్తీ పాలను తయారు చేస్తున్న ఇంటిపై గురువారం ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి 80 లీటర్ల కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాల వ్యాపారి కంటే మహేందర్ కల్తీ పాలను విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు ఇంటిని తనిఖీ చేశారు. ఈమేరకు 80 లీటర్ల కల్తీ పాలతో పాటు 300 మీ. లీ హైడ్రోజన్ పెరాక్సైడ్, 10 స్కిమ్డ్ పాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, మహేందర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డివాముకు నిప్పు

మిర్యాలగూడ టౌన్: మండలంలోని తడకమళ్ల గ్రామంలో గురువారం గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన యల్లపల్లి నరసయ్య తన వ్యవసాయ పొలంలో గడ్డివామును నిల్వ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు అంటించడంతో గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయంపై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. 950 గడ్డి కట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.80 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.